

చినవెంకన్నకు రూ.2.32 కోట్ల ఆదాయం


ప్రజాశక్తి - ద్వారకాతిరుమల



ప్రముఖక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి యాత్రికుల విరాళాల ద్వారా రూ.2,32,56,651 ఆదాయం లభించింది. ఆలయ హుండీలను బుధవారం ఉదయం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. 20 రోజులకుగాను చేపట్టిన ఈ లెక్కింపులో నగదు రూపేణ పైనపేర్కొన్న నగదు, బంగారం 442 గ్రాములు, వెండి ఆరు కేజీల 572 గ్రాములు, పాత రూ.500 నోట్లు తొమ్మిది, రూ.వెయ్యి నోట్లు 11, పలు దేశాల కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు తెలిపారు.

8న జెడ్‌పి ఛైర్మన్ ఎన్నిక

నోటిఫికేషన్ జారీ చేసిన ఎన్నికల కమిషన్
మే 14న ఛైర్మన్ పదవికి కవురు రాజీనామా
ఎట్టకేలకు నోటిఫికేషన్ జారీపై సభ్యుల్లో హర్షం
ఆశావహులంతా ఛైర్మన్ గిరి కోసం ముమ్మర యత్నాలు
9 మంది బిసి జెడ్‌పిటిసిల్లో ఛైర్మన్ గిరి దక్కేదెవరికో
ప్రజాశక్తి కథనాలకు స్పందన



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల నాలుగో తేదీలోపు జిల్లా పరిషత్ సభ్యులందరికీ సమాచారం అందించాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఎనిమిదో తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించి ఛైర్మన్ ఎన్నిక పూర్తి చేయాలని, ఒకవేళ ఎట్టి పరిస్థితుల్లోనైనా ఆ రోజు సమావేశం జరగకపోతే తొమ్మిదో తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నిక పూర్తి చేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. తొమ్మిదో తేదీన కూడా సమావేశం జరగని పక్షంలో ఎన్నికల కమిషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపింది. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి ఖాళీగా ఉండటంపై కొన్ని రోజులుగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఛైర్మన్ ఎన్నిక జరపకపోవడంపై ప్రజాశక్తిలో వరుస కథనాలు ప్రచురితమవ్వడంతో అధికారులు స్పందించి ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారు. వివరాల్లోకి వెళ్తే జెడ్‌పి ఛైర్మన్‌గా కవురు శ్రీనివాస్ బాధ్యతల్లో ఉన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో వైసిపి ఆయనను ఎంఎల్‌సి అభ్యర్థిగా బరిలోకి దింపింది. కవురు శ్రీనివాస్ ఎంఎల్‌సిగా గెలుపొందడంతో తదుపరి ఛైర్మన్ ఎవరనే ఉత్కంఠ నెలకొంది. మే 14వ తేదీన కవురు శ్రీనివాస్ జెడ్‌పి ఛైర్మన్ పదవికి రాజీనామా చేసి 15న ఎంఎల్‌సిగా ప్రమాణస్వీకారం చేశారు. నిబంధనల ప్రకారం ఛైర్మన్ పదవికి రాజీనామా చేసిన వెంటనే ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా వైస్ ఛైర్మన్‌ను నియమించాల్సి ఉంది. అయితే జెడ్‌పికి ఇద్దరు వైస్ ఛైర్మన్లు ఉండటంతో ఎవరిని నియమించాలనే సందిగ్ధత నెలకొంది. దీంతో జెడ్‌పి ఛైర్మన్ పదవికి ఎన్నిక ప్రహసనంలా మారింది. దాదాపు 15 రోజులు దాటినా ఛైర్మన్ స్థానంలో ఎవరినీ నియమించకపోవడంపై రాజకీయంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఛైర్మన్ పదవికి సంబంధించి బుధవారం నోటిఫికేషన్ జారీ కావడంతో జిల్లా పరిషత్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఛైర్మన్ గిరి ఎవరికో..!

జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి బిసిలకు రిజర్వు అయ్యింది. దీంతో యలమంచిలి జెడ్‌పిటిసిగా గెలుపొందిన కవురు శ్రీనివాస్ అప్పట్లో ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. కవురు రాజీనామా చేయడంతో ఆ పదవిని బిసి తరగతికి చెందిన సభ్యులతోనే భర్తీ చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో 48 మండలాలు ఉండగా 46 చోట్ల వైసిపి వారే జెడ్‌పిటిసిలుగా గెలిచారు. దీనిలో పది మండలాల్లో బిసి తరగతికి చెందిన జెడ్‌పిటిసి సభ్యులు ఉన్నారు. కవురు రాజీనామాతో ఇంకా భీమడోలు, భీమవరం, కాళ్ల, మొగల్తూరు, నరసాపురం, ఉంగుటూరు, పాలకోడేరు, పెదపాడు, ఉండి మొత్తం 9 మండలాల్లో బిసి తరగతికి చెందిన సభ్యులు ఉన్నారు. వీరిలో ఒకరిని జెడ్‌పి ఛైర్మన్ పదవి వరించనుంది. దీంతో వీరంతా తమ తమ ఎంఎల్‌ఎలను, ఎంపీలను, మంత్రులను కలుస్తూ ఛైర్మన్ పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అదే క్రమంలో ఛైర్మన్ పదవి ఈ సారి విభజిత ఏలూరు జిల్లాకు ఇవ్వాలని ఇక్కడి నాయకులు గట్టి పట్టుబడుతున్నారు. అందుకు ప్రత్యేక కారణం కూడా ఉంది. విభజిత పశ్చిమగోదావరి జిల్లా నుంచే శాసనమండలి ఛైర్మన్, ప్రభుత్వ చీఫ్ విప్, రెండు ఎంఎల్‌సి స్థానాలు, డిసిసిబి ఛైర్మన్, డిసిఎంఎస్ ఛైర్మన్ వంటి కీలక పదవులు చేజిక్కించుకున్నారు. కాబట్టి జెడ్‌పి ఛైర్మన్ పదవి ఏలూరు జిల్లాకు ఇవ్వాలని వీరంతా కోరుతున్నారు.

ఇటీవల దెందులూరు నియోజకవర్గంలో జరిగిన సమావేశంలో స్థానిక ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ పెదపాడు మండలానికి చెందిన జెడ్‌పిటిసి ఘంటా పద్మశ్రీకి జెడ్‌పి ఛైర్‌పర్సన్ పదవి ఖాయమని ప్రకటించారు. దీంతో ఛైర్‌పర్సన్ పదవి రేసులో ఘంటా పద్మశ్రీ ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. ఛైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడడంతో ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ నెల ఎనిమిదో తేదీన ఛైర్మన్ ఎవరనేది తేలిపోనుంది.

'ఉపాధి'కి తగినన్ని నిధులు కేటాయించాలి

పనుల సందర్శనలో నేతలు



పెంటపాడు మండలం ముదునూరులో మాట్లాడుతున్న జక్కంశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - పెంటపాడు

ప్రజల కొనుగోలు శక్తిని పెంచే గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి తగినన్ని నిధులు బడ్జెట్లో కేటాయిస్తే నిరుద్యోగ భూతాన్ని తరిమికొట్టొచ్చని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు అన్నారు. మండలంలోని ముదునూరు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రాంతాన్ని నేతలు సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ నేడు వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల ఫలితంగా కూలీలకు పనులు పూర్తిగా కనుమరుగయ్యాయని, ప్రధానంగా ఉపాధి హామీ పని కీలకంగా మారిందని అన్నారు. అటువంటి చట్టానికి నిధులు కేటాయించడంలో ప్రధాని మోడీ మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. జిల్లాలో పని కావాలని కోరుకున్న వారందరికీ పని కల్పించాలంటే బడ్జెట్లో రూ.2.50 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. తొలగించిన సౌకర్యాలను పునరుద్ధరించాలని, ఎన్ఎంఎంఎస్ యాప్‌ను రద్దు చేయాలని, తొలగించిన గత సౌకర్యాలన్నింటిని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వడ్డీ సత్యనారాయణ, చల్లా కాశీవిశ్వనాథ్, బుద్దాన వెంకటలక్ష్మి, కాకర్లపూడి దశరధుడు, మానుకొండ యాకోబు, కాకర భార్గవి, రామిశెట్టి రాఘవ రాజు, కాల గంగాభవాని, తెలగాపు నాగలక్ష్మి పాల్గొన్నారు.

పోదూరు: ఉపాధి పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ విమర్శించారు. మండలంలోని వద్దిపర్రులో బుధవారం ఉపాధి పని ప్రదేశంలో కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కూలీలు మండుటెండలో మాడిపోతున్నా టెంట్లు ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు. పే స్లిప్‌లు ఇవ్వాలని కోరారు. గతంలో చేసిన పని బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. లేకుంటే ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఎసిబి వలలో పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్


కాంట్రాక్టర్ నుంచి పంచాయతీ కార్యదర్శి లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు వలపన్ని పట్టుకున్న ఘటన బుధవారం మధ్యాహ్నం మండలంలో సంచలనం రేకెత్తించింది. దీనికి సంబంధించి ఎసిబి అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పోలమూరు గ్రామానికి చెందిన పంచారా వెంకట రంగారావు చిన్న చిన్న కాంట్రాక్ట్ పనులు చేస్తుంటారు. దీనిలో భాగంగా 2021లో సగం చెరువు శ్మశానవాటికలో వెళ్లాడానికి తొలగించి నేల చదును చేసే పని నిర్వహించారు. దీనికి సంబంధించి రూ.75 వేలు బిల్లు రావాల్సి ఉంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి పార్థసారథిని రంగారావు సంప్రదించగా రూ.15 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీనిపై ఒప్పందం కుదుర్చుకున్న రంగారావు ఆ సమాచారం ఎసిబి అధికారులకు చేరవేశాడు. ముందస్తు పథకం ప్రకారం తొలివిడతగా రూ.4 వేలు సొమ్ము లంచంగా రంగారావు సగం చెరువు పంచాయతీలో ఉన్న కార్యదర్శి పార్థసారథికి బుధవారం మధ్యాహ్నం ఇస్తుండగా ఎసిబి అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి శరత్‌బాబు సారధ్యంలో సిఐలు భాస్కరరావు, ఏసుబాబు, శ్రీనివాస్, నాగేంద్ర ప్రసాద్ ఈ దాడిలో పాల్గొన్నారు. కార్యదర్శి పార్థసారథి గోరింటాడ, బల్లిపాడు, వరిధనం పంచాయతీలకు ఇన్‌ఛార్జి కార్యదర్శిగానూ బాధ్యతల్లో ఉన్నారు. ప్రతి గ్రామంలోనూ ఈయనపై అవినీతి ఆరోపణలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. పార్థసారథిని బుధవారం రాత్రి వరకూ పంచాయతీ కార్యాలయంలోనే ఎసిబి అధికారులు విచారించారు. గురువారం రాజమండ్రిలోని ఎసిబి కోర్టులో హాజరుపరుస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.



పంచాయతీ కార్యదర్శి పార్థసారథి

వృద్ధులను ప్రేమతో ఆదరించాలి

రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్



వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వృద్ధులను ప్రేమతో ఆదరించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. బుధవారం చినమిరం శివారు తమిళ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అత్యాధునిక వసతులతో వృద్ధాశ్రమాన్ని జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ భీమవరంలో ఇప్పటికే ఒక వృద్ధాశ్రమం విజయవంతంగా నడుస్తుందని, ఇది రెండోదని, దీన్ని నా చేతుల మీదుగా ప్రారంభించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. నేడు పిల్లల నిర్లక్ష్యంతో తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని, ఏ దిక్కూ లేని వృద్ధులను చేరదీసి వృద్ధాశ్రమంలో చేర్పించి వారి శేష జీవితానికి సకల సౌకర్యాలు కల్పించి ఏ లోటు లేకుండా చూసుకోవడం అభినందనీయమన్నారు. పిల్లలు చూడక కొంతమంది, పిల్లలు దూరప్రాంతాల్లో స్థిరపడటం వల్ల కొంతమంది వృద్ధాశ్రమంలో వారి జీవితం గడపాల్సి వస్తుందన్నారు. వృద్ధాశ్రమం ఆధునిక వసతులతో నిర్మించడం సామాన్య విషయం కాదని, దీన్ని ఏర్పాటు చేసిన చిలుకూరు నరసింహారాజు, నిర్వాహకురాలు బిహెచ్.లక్ష్మిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి వృద్ధాశ్రమం ఏర్పాటు చేయడం, ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించడం సంతోషించదగిన విషయమని అన్నారు. కొంత వయస్సు దాటిన ప్రతిఒక్కరూ వృద్ధులు కాక తప్పదని, పిల్లలు చూడకపోతే ఇటువంటి వృద్ధాశ్రమాలే ఆసరా కేంద్రాలని అన్నారు. జిల్లాలో దాతల కొదవ లేదని, మరెన్నో ప్రాంతాల్లో ఇటువంటి వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేస్తే చాలా బాగుంటుందని జెసి సూచించారు. ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ వృద్ధుల ఆశ్రమం ఒక వైట్‌హౌస్‌ను తలపించేలా నిర్మించిన దాతల కృషి చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ఎవి.సుబ్బరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహారాజు, వృద్ధాశ్రమం ఏర్పాటు దాత చిలుకూరి నరసింహారాజు, నిర్వాహకులు బిహెచ్.లక్ష్మి, భీమవరం హాస్పిటల్స్ ఎమ్‌డి డాక్టర్ గాదిరాజు గోపాలరాజు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, స్థానికులు డొక్కు సోమేశ్వరరావు, ఇందుకూరి ఆంజనేయరాజు, వృద్ధాశ్రమ నిర్వహణ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఒఎల వినతి

ప్రజాశక్తి - వీరవాసరం

తమ సమస్యలను పరిష్కరించాలని బుధవారం విఒఎ (యానిమేటర్)లు నిరసన చేపట్టారు. అనంతరం వీరవాసరంలో ఎపిఎం అమీర్‌ఉన్నీషాకు వినతిపత్రం అందజేశారు. వీరికి సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరాలు తరబడి అనేక కష్టనష్టాలను అనుభవించి పని చేస్తున్న యానిమేటర్లను కాలపరిమితి జిఒ తెచ్చి ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు. గ్రామ సమాఖ్యలో తక్కువ గ్రూపులున్నాయనే పేరుతో వాటిని ఇతర సమాఖ్యల్లో కలిపి కొంతమంది యానిమేటర్లను తొలగించాలనే ప్రభుత్వ ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. తక్షణమే యానిమేటర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యానిమేటర్ల సంఘం మండల నాయకురాలు పి.రత్నకుమారి, రాజేశ్వరి, మధులత, పుష్ప, శ్రీలక్ష్మి, చంద్రకళ, సీతామహాలక్ష్మి, ఏడుకొండలు, శ్రీను పాల్గొన్నారు.

నూతన ఇసుక రీచ్‌లను గుర్తించాలి

జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో నూతన ఇసుక రీచ్‌లను, డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నూతన ఇసుక రీచ్‌లను, డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించి ప్రతిపాదనలను జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యలమంచిలి మండలంలోని అబ్బిరాజుపాలెం, లక్ష్మీపాలెం, నరసాపురం పరిధిలోని మాధవాయపాలెంలోని మూడు డీసిల్టేషన్ పాయింట్లకు ఏప్రిల్ 30తో గడువు పూర్తవుతుందని, కాలపరిమితి పెంపునకు ప్రతిపాదనలు పరిశీలించి రివర్ కన్జర్వేటర్ ఇఇ ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. గత మార్చిలో నిర్వహించిన ఇసుక కమిటీ సమావేశంలో ఆమోదించిన పెనుగొండ మండలంలోని సిద్ధాంతం 1, 2, నడిపూడి-1, 2 నాలుగు కొత్త రీచ్‌లకు సంబంధించి వెంటనే సమర్పించాలని జయప్రకాష్ పవర్ వెంచర్స్ డిస్ట్రిక్ ఇన్‌ఛార్జిని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి జి.జయప్రసాద్, రివర్ కన్జర్వేటర్ గోదావరి హెడ్ వాటర్ వర్క్స్ ఇఇ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, ఎస్ఇబి ఎఎస్‌పి ఎటివి.రవికుమార్, డిపిఒ జివికె.మల్లికార్జునరావు, ఎంవిఐ వెంకటరమణ, భూగర్భ జలాలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు, జైప్రకాష్ పవర్ వెంచర్స్ జిల్లా ఇన్‌ఛార్జి సి.రాజారెడ్డి, డిస్ట్రిక్ కోఆర్డినేటర్ హరీష్‌రెడ్డి పాల్గొన్నారు

స్కూల్ స్వీపర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

డిఇఒతో నేతల చర్చలు

ప్రజాశక్తి - భీమవరం

మున్సిపల్ పాఠశాలల్లో ఎంతోకాలం నుండి పని చేస్తున్న స్కూల్ స్వీపర్లను కొనసాగించాలని, జిఒ 84 ఆధారంగా విద్యాశాఖలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిఇఒకు విజ్ఞప్తి చేశారు. సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ స్కూల్ స్వీపర్స్ యూనియన్ నాయకత్వం డిఇఒతో చర్చించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెం.84 ద్వారా మున్సిపాల్టీలో పని చేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్లు, స్కూల్ స్వీపర్లను విద్యాశాఖలో విలీనం చేశారని, నిర్వహణ, జీతాలు విద్యాశాఖ ద్వారా ఇవ్వాలని కోరారు. జిఒ ప్రకారం ప్రతి మున్సిపాల్టీలో అనేక సంవత్సరాల నుంచి పని చేస్తున్న స్కూల్ స్వీపర్ల వివరాలు సేకరించి వారికి ఉద్యోగ భద్రత, రక్షణ కల్పించాలని కోరారు. ఇప్పటివరకు మున్సిపల్ కమిషనర్ ద్వారా వస్తున్న జీతాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. పార్ట్ టైమ్ పని అని చెప్పి వీరందరిచే ఫుల్‌టైమ్ పని చేయించుకోవడం అన్యాయమని నేతలు తెలిపారు. జిల్లాలో ఆరు మున్సిపాల్టీల్లో ఉన్న స్కూల్ స్వీపర్ల సమస్యలపై చర్చించారు. జిఒ 84 అమలుకు కృషి చేస్తానని, అన్ని మున్సిపాల్టీల నుండి వివరాలు తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల అమలుకు కృషి చేస్తానని వారు హామీ ఇచ్చారు. ఈ చర్చల్లో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.నాగేశ్వరరావు, స్కూల్ స్వీపర్ల సంఘ నాయకులు అంజలి, రజిత, వెంకటలక్ష్మి, అర్జునమ్మ, నాగమణి, కళ్యాణి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం పట్టణాభివృద్ధే లక్ష్యం

కౌన్సిల్ సమావేశంలో చీఫ్‌విప్, ఎంఎల్ఎ ప్రసాదరాజు



మాట్లాడుతున్న ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం పట్టణాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ జయరాజు అధ్యక్షతన జరిగిన సాధారణ, అత్యవసర కౌన్సిల్ సమావేశాల్లో ప్రసాదరాజు పాల్గొని మాట్లాడారు. రుస్తుంబాద జగనన్న కాలనీ లేఅవుట్లలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. 4500 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించి వారు ఇల్లు కట్టుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. తాగునీటికి అత్యధిక నిధులు కేటాయించి ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందిస్తున్నామన్నారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని డ్రెయినేజీ వ్యవస్థను ప్రక్షాళన చేశామన్నారు. పారిశుధ్య పనుల్లో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అందులో భాగంగా డ్రెయినేజీల్లో సిల్టు తొలగింపు పనులు చేపట్టారన్నారు. వీధి దీపాలు పూర్తిస్థాయిలో వెలగాలన్నారు. పట్టణంలో నెలకొన్న సమస్యలను కౌన్సిల్ సమావేశంలో చర్చించి పరిష్కరించుకోవాలని ప్రసాదరాజు సూచించారు. రుస్తుంబాద శ్మశాన వాటికను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని వైస్ ఛైర్మన్ కొత్తపల్లి భుజంగరాయుడు (నాని) కోరారు. జగనన్న కాలనీ ఏర్పాటుతో ఎంతోమంది సొంతింటి కల నెరవేర్చుకుంటున్నారని, ఈ కాలనీలో ఆర్చి నిర్మాణానికి ర్యాటిఫికేషన్ ద్వారా ఆమోదం తెలపాల్సిన అవసరం లేదని, ముందుగా కౌన్సిల్ సభ్యులకు తెలియజేసి ఆమోదించుకుంటే బాగుండేదని అన్నారు. 31 వార్డు కౌన్సిలర్ పాలూరి బాబ్జీ మాట్లాడుతూ తన వార్డులో అభివృద్ధి పనులు పేరుకే తప్ప ఏఒక్కటీ జరగడం లేదన్నారు. గ్రామంలోని జగనన్న కాలనీలో ఆర్చికి మున్సిపల్ నిధులు ఎందుకు ఖర్చు చేస్తారని అభ్యంతరం వ్యక్తం చేస్తూ టిడిపి తరుపున డీసెంట్ ఇవ్వగా ఆ కాలనీ ఆర్చి నిర్మాణానికి హౌసింగ్ శాఖ నుంచి నిధులు వస్తాయని ఛైర్‌పర్సన్ వెంకట రమణ వివరణిచ్చారు. ఏడో వార్డు కౌన్సిలర్ కోటిపల్లి సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా చివరి తేదీన కాకుండా 15వ తేదీలోపు కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాలని, దానివల్ల అవసరమైతే కౌన్సిల్ సభ్యులు వార్డు సమస్యలపై ఎక్కువగా మాట్లాడే అవకాశం ఉంటుందని అన్నారు. 15వ వార్డు కౌన్సిలర్ బొమ్మిడి సూర్యకుమారి మాట్లాడుతూ డ్రెయిన్లలో పూడికతీత పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. తొమ్మిదో వార్డు కౌన్సిలర్ కస్తూరి ఇందిరాదేవి మాట్లాడుతూ 2003 పుష్కరాల్లో కొంత స్థలం కోల్పోయిన పొన్నపల్లి రామకృష్ణారావుకు హైకోర్టు ఆర్డర్ ప్రకారం నరసాపురం మున్సిపాల్టీ నుంచి రూ.26.36 లక్షలు చెల్లించాల్సి ఉండగా వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 19వ వార్డు కౌన్సిలర్ కేసరి గంగరాజు మాట్లాడుతూ 25, 26 వార్డుల్లో అక్రమ లేఅవుట్లపై దృష్టి పెట్టాలన్నారు. 25వ వార్డు కౌన్సిలర్ యర్రా ఉమ మాట్లాడుతూ తన వార్డులో పెట్రోల్ బంకు నిర్మాణ పనులను ప్రజల అవగాహన చేసుకునేందుకు కొద్ది రోజులు నిలుపుదల చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఛైర్‌పర్సన్ కామన నాగిని, కమిషనర్ డాక్టర్ కెవి.రావు, కౌన్సిలర్లు బొంతు రాజశేఖర్, మల్లాడి శేషవేణి, పతివాడ పద్మ, బర్రి జయరాజు, ద్వార గంగాభవాని, సఖినేటిపల్లి సురేష్, తోట అరుణ, జి.జయరాజ్‌సింగ్, వంగా కన్నా, తాడి సునీత, కావలి రామసీత, జిల్లెళ్ల దిలీప్‌కుమార్, గోరు రమాదేవి, అడిదెల విజయశ్యామల, కోఆప్షన్ సభ్యులు వైకెఎస్, అబేదా సుల్తానా, చింతా మాలతి మాట్లాడారు.

పోలవరం ప్రాజెక్టు పరిధిలో చిరుత కలకలం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు పరిధిలో చిరుతపులి సంచరిస్తుందని, ప్రాజెక్టు కార్మికులు, తరచూ అడవిలో సంచరించేవారు అప్రమత్తంగా ఉండాలని అటవీ క్షేత్రాధికారి దావీదు రాజు సూచించారు. బుధవారం తెల్లవారుజామున పోలవరం ప్రాజెక్టు వాహనానికి స్థానిక 902 హిల్ ప్రాంతంలో గోదావరిలోకి తాగునీటి కోసం దిగి వెళుతున్న చిరుతపులి కనిపించడంతో ప్రాజెక్టు కార్మికులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు చిరుతపులి సంచరించిన ప్రాంతానికి వెళ్లి పాదముద్రలు పరిశీలించారు. అనంతరం దావీదు రాజు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కార్మికులు బహిర్భూమికి బయటకు వెళ్లడం, సరదాగా అడవుల్లో సంచరించడం చేయరాదని, ప్రాజెక్టు కార్మికులు చికెన్ వ్యర్థాలు, ఇతర మాంసాహార పదార్థాలు బహిరంగ ప్రదేశాల్లో పడవేయరాదని, అడవుల్లో కట్టెలు కొట్టుకునే వారు కలప కోసం వెళ్లేవారు రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో సంచరించరాదని హెచ్చరించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పివి.మధుకర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ డి.రాజేష్ చిరుతపులి సంచరించిన ప్రాంతాల్లో పాదముద్రల సేకరణలో పాల్గొన్నారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు కార్మికుల లేబర్ క్యాంపులో చిరుత సంచారంపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.



పేద రైతులకు అండగా..

భూనష్టపరిహార సాధన ఉద్యమ కమిటీ ఆధ్వర్యాన రేపు అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు జగనన్న ఇళ్ల స్థలాలకు భూములిచ్చిన నిరుపేద రైతులకు అందరం అండగా ఉండి ఆదుకుందామని భూ నష్టపరిహార సాధన ఉద్యమ కమిటీ పిలుపునిచ్చింది. ఈ నెల రెండో తేదీ శుక్రవారం ఉదయం 9:30 గంటలకు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో అఖిలపక్షం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిటీ వెల్లడించింది. ఈ మేరకు భూ నష్టపరిహార సాధన ఉద్యమ కమిటీ నాయకులు శేషపు అత్రియ్య, ఎస్ఎస్ఎస్ఎస్.సాయిబాబా బుధవారం తెలిపారు. పాలకోడేరు కోడిగట్టులో ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం పేద రైతుల నుండి భూమి సేకరించిందని గుర్తు చేశారు. ఎకరాకు రూ.66 లక్షలు ఇస్తామని అధికారులు రైతులను ఒప్పించి 5.25 ఎకరాలు తీసుకున్నారని, వీరిలో మూడు కుటుంబాల వారికి ఒక్కొక్కరికి 50 సెంట్లు తప్ప ఇతర ఆస్తులేమీ లేవని పేర్కొన్నారు. కనీసం ఇంటిస్థలం కూడా లేని కుటుంబం కూడా ఉందన్నారు. భూసేకరణకు సంతకాలు తీసుకున్న కొన్ని నెలలు తరువాత మీకు నష్టపరిహారం రాదని స్థానిక తహశీల్దార్ నోటీస్ ఇచ్చి సబ్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కోర్టులో అప్పీలు చేసుకోమని సెలవిచ్చారని తెలిపారు. కరోనా తీవ్రంగా ఉండటంతో సకాలంలో బయటకు వెళ్లలేని పరిస్థితి, అదే సమయంలో ఈ కుటుంబాల వారు అనారోగ్యానికి గురవ్వడంతో ఏకపక్షంగా అధికారులు భూస్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. ఇప్పటికే పేద రైతు నల్లి పెద్దులు అనారోగ్యం, తీవ్ర మనోవేదనతో మృతి చెందారని, మరో రైతు కుటుంబం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుటుంబాల వారు పసిపిల్లలతో సహా గత 23 రోజులుగా వడగాల్పులు, వర్షాన్ని లెక్క చేయకుండా తమ భూమిలోనే దీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, వృత్తి సంఘాలు తదితరులతో భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించడం కోసం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నామని తెలిపారు.



వేలం వేసిన మోటార్ సైకిల్

సీజ్ చేసిన మోటార్ సైకిళ్ల వేలం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇటీవల సీజ్ చేసిన మోటార్ సైకిళ్ల వేలం వేసినట్లు తణుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఆర్.సత్యవతి అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన రెండు మోటార్ సైకిళ్లను పెనుగొండ సిఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేలం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫైన్ బైక్‌ను రూ.7 వేలకు, పల్సర్ బైక్ రూ.10,500లకు వేలం వేసినట్లు తెలిపారు. వేలం వేసిన వీటికి 18 శాతం జిఎస్‌టి పాట యజమాని చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి.సురేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యకృష్ణ కిరణ్ ప్రసాద్

పొగాకుకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ఉండి

పొగాకు వాడే వారిలో ఎక్కువగా ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తోందని విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నల్ల సత్యకృష్ణ కిరణ్‌ప్రసాద్ అన్నారు. బుధవారం ఉండి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయ అధికారి జెవి.కృష్ణమూర్తి అధ్యక్షతన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నల్ల సత్యకృష్ణ కిరణ్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులందరూ మాదకద్రవ్యాలు, పొగాకు వాడకానికి వ్యతిరేకంగా ఉండాలని సూచించారు. పొగాకు, చుట్ట, బీడీ, సిగరెట్, గుట్కా, ఖైనీ, జరదా వంటి వాటి వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే వీటిని వ్యతిరేకించడంతో భవిష్యత్తులో ఆరోగ్యంగా ఉంటారన్నారు. విద్యార్థులు పొగాకు ఉత్పత్తిని వ్యతిరేకించి గ్రంథాలయాల్లో లభ్యమయ్యే పుస్తకాలను చదివి విజ్ఞానవంతులుగా తయారవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

మొగల్తూరు : పొగాకు వినియోగంతో ప్రజల అనారోగ్యానికి గురవుతారని వైద్యులు దినేష్ కుమార్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మొగల్తూరులో ప్రాథమిక ఆరోగ్య శాఖ సిబ్బంది అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్, ఊపిరితిత్తుల సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లీనా సుప్రియ, సిబ్బంది కిశోర్, సావిత్రి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గణపవరం : ప్రపంచ పొగాకు దినోత్సవం సందర్భంగా పిహెచ్‌సి ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.కిరణ్మయి మాట్లాడుతూ పొగ తాగడం వల్ల అనారోగ్యం పాలవుతారని తెలిపారు. పొగ తాగేవారితోపాటు పక్కవారికి కూడా రోగాలు వస్తాయన్నారు. ర్యాలీలో సిహెచ్‌ఒ జి.విల్సన్ బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు : నేటి సమాజంలో ఆరోగ్య సంరక్షణకు పొగాకు ఉత్పత్తులను నిషేధించడం అత్యంత అవసరమని ప్రముఖ సామాజిక సేవకుడు, న్యాయవాది నెల్లి సతీష్ కుమార్ అన్నారు. 15 రోజులుగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు, 'నో స్మోకింగ్ డే' సందర్భంగా అదనపు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే హానిని విద్యార్థులకు వివరించారు. ఇంట్లో గాని, తమ పరిసరాల్లో గాని పొగాకు ఉత్పత్తులను కాల్చే వారిని ఆపేందుకు ప్రయత్నిస్తామంటూ ఆయన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆరోగ్య సంరక్షణకు ఆటలు కూడా ఎంతో ప్రధానమన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి సాయంత్రం వేళలో ఆటలకు సమయాన్ని కేటాయించాలని సూచించారు. గ్రంథాలయ పాలకురాలు పార్వతి పాల్గొన్నారు.



ఆకివీడు : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - కాళ్ల

ఏలూరుపాడులో రొయ్యల చెరువు వద్ద పేకాట స్థావరంపై కాళ్ల పోలీసులు బుధవారం మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 22,890 రూపాయల నగదు, మూడు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాళ్ల ఎస్ఐ ఎజిఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రక్తదాన శిబిరంలో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

పాలకొల్లులో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పాలకొల్లు

రక్తాన్ని చిందిస్తాం.. రాష్ట్రాన్ని రక్షించుకుంటామంటూ పాలకొల్లులో తెలుగు యువత బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అంబేద్కర్ భవనంలో చంద్రబాబు ప్రకటించిన మినీ ప్రణాళికలో ప్రకటించిన 20 లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఉద్దేశానికి మద్దతుగా ఈ శిబిరం నిర్వహించారు. ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌ఎ అంగర రామ్మోహన్ హాజరయ్యారు. రాష్ట్రంలో చేతకాని ప్రభుత్వం ఉండడంతో పారిశ్రామికవేత్తలు ఇతర ప్రాంతాలకు వెళ్లి పోతున్నాయన్నారు. దీంతో యువత ఉద్యోగాలు, ఉపాధి కోసం వలస వెళ్లిపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యువత అధ్యక్షులు మండవ అవినాష్, కర్నేన గౌరు నాయుడు, పెచ్చెట్టి బాబు, జివి కోడి విజయభాస్కర్, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, పెన్మెత్స రామభద్రరాజు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు

ఇషా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొర్రా మురళీకృష్ణ

హలో డాక్టర్





ఇషా ఆసుపత్రి

ప్రజాశక్తి - తణుకు

పేదలకు అందు బాటులో ఉండేలా మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు ఇషా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొర్రా మురళీకృష్ణ (జనరల్ మెడిసిన్) చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. 15 సంవత్సరాల నుంచి తమ హాస్పిటల్‌లో విశిష్ట సేవలందిస్తున్నామన్నారు. 24 గంటలూ డాక్టర్ల పర్యవేక్షణలో రోగులకు వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు. పట్టణంలో దొడ్డిపట్లవారివీధిలోని తమ ఆసుపత్రిలో 24/7 ఐసియు క్రిటికల్, ఎమర్జెన్సీ కేర్‌లో, యాక్సిడెంట్, పాయిజన్ కేసులు చూస్తున్నట్లు తెలిపారు. న్యూరో సర్జరీ విభాగంలో మెదడు, వెన్నెముక శాస్త్ర చికిత్సలు, ఆర్థోపెడిక్ విభాగంలో ఎముకలకు సంబంధించిన సమస్యలు, జనరల్ లాప్రోస్కోపీ సర్జరీ హెర్నియా, హెర్నియా, థైరాయిడ్ సర్జరీ తదితర వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. జనరల్ మెడిసిన్ విభాగంలో షుగర్, బిపి, జ్వరం తదితర వాటికి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. యూరాలజీ, గైనకాలజీ, ఒబిజి, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఫిజియోథెరపీ వంటి వైద్య సేవలు తమ హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పేషెంట్లకు కావాల్సిన వైద్యానికి సంబంధించి పెద్ద హాస్పిటల్స్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే తమ హాస్పిటల్‌లోనే పేషెంట్లకు వైద్యం అందుతోందన్నారు. అన్ని విభాగాలకూ చెందిన డాక్టర్లు అన్నివేళలా అందుబాటులో ఉంటారని తెలిపారు. కరోనా సమయంలో సుమారు 600 మందికి వైద్య సేవలు అందించినట్లు వివరించారు. తణుకు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని మురళీకృష్ణ కోరారు.

తూడు తొలగింపునకు కలుపుమందు పిచికారీ

ప్రజాశక్తి - ఆచంట

రానున్న సార్వా సాగును దృష్టిలో పెట్టుకుని కొడమంచిలి, తాడేరు మురుగు కాలువలో పేరుకుపోయిన తూడు తొలిగింపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు. బుధవారం కొడమంచిలి, తాడేరు మురుగు కాలువలో కలుపు మందు పిచికారీ చేసే పనులను సర్పంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఏ విధమైన ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ముందస్తుగానే కలుపు మందు పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. కాలువల పక్కన నివాసం ఉంటున్న ప్రజలు ఏ విధమైన ప్లాస్టిక్, వ్యర్థ వస్తువులు కాలువలో వేయొద్దని తెలిపారు. ఎవరికి వారు డస్ట్ బిన్‌లో వేసుకొని పంచాయతీ చెత్త రిక్షా వచ్చేటప్పుడు వ్యర్థ పదార్థాలన్నీ ఆ రిక్షాలో వేసే విధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు మన్నె సుబ్బారావు, సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు సాక సురేష్ పాల్గొన్నారు.



కాలువలో కలుపు మందు పిచికారీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచి సీతారామ్

మిల్లర్ల ఆగడాలను అరికట్టాలి : కౌలు రైతుసంఘం

ప్రజాశక్తి - పెనుగొండ, ఇరగవరం

మిల్లర్ల ఆగడాలు, కుట్రలను అరికట్టి ధాన్యాన్ని వెంటనే తరలించే ఏర్పాట్లు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు డిమాండ్ చేశారు. బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో పెనుగొండ, ఇరగవరం మండలాల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ సుమారు మండలంలో పదివేల క్వింటాళ్లు ఇంకా తరలించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని చెబుతున్నారని తెలిపారు. మరోవైపు ధాన్యం కొనుగోలులో నూకశాతం ఎక్కువగా ఉందని 41 కేజీల బస్తాకు 4 కేజీల నుంచి 6 కేజీల వరకూ తరుగు చూపి రైస్ మిల్లుల వద్ద యాజమాన్యాలు ధాన్యం దింపుకోమని రైతును భయపెట్టి సొమ్ము చేసుకుంటున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. గ్రామాల్లో సంచుల కొరతతో పట్టుబడి జరగక రాశుల రూపంలోనే ధాన్యాలు కళ్లాల్లోనే ఉన్నాయని తెలిపారు. రైతన్న పంటను అమ్ముకోలేని దుస్థితిలో ఉన్నాడని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల నుంచి, ప్రభుత్వ అధికారుల నుంచి రైతుకు తగినంత సహకారం లేకపోవడంతో మిల్లులకు రైతులు నష్టానికి అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఇరగవరం మండలం కాకిలేరు గ్రామానికి చెందిన ఇళ్ల వెంకటేశ్వరరావు 250 సార బస్తాలు పాలకొల్లులో ఓ రైసుమిల్లుకు ధాన్యం రవాణా చేస్తే 13 సార బస్తాలు తరుగు విధించారని తెలిపారు. మరో రైతు దంగేటి నాగ భాస్కర సూర్యారావు తాడేపల్లిగూడెంలో ఓ రైస్ మిల్లుకు 200 సార బస్తాలు రవాణా చేస్తే 800 కేజీలు తరుగు విధించారని తెలిపారు. సిండికేట్ సిస్టంను అరికట్టి వెంటనే ధాన్యం తరలించే ఏర్పాటు చేయాలని, లేకపోతే రైతులతో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న నేతలు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


ప్రజాశక్తి - తణుకురూరల్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాప్టో తరపున జూన్ 5వ తేదీ నుంచి సెప్టెంబరు వరకూ ధర్నాలు, ర్యాలీలు, సదస్సులు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిఒ 117ను రద్దు చేయాలని, బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని, ఉద్యోగోన్నతులు రెగ్యులర్ ప్రాతిపదికన ఇవ్వాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని, పిఆర్‌సి బకాయిలను వెంటనే రద్దు చేయాలని, 12వ పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 11వ పిఆర్‌సికి వేతనాలకనుగుణంగా పెంచాలని కోరుతూ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని రాజగోపాల్ కోరారు.

దానమ్మ ఆలయ పున:నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెనుమంట్ర

సోమరాజు ఇల్లింద్రపర్రులో దానమ్మ అమ్మవారి ఆలయ పున్ణనిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ప్రభుత్వ ఇండస్ట్రీస్, ఇన్వెస్ట్మెంట్, కామర్స్ డిపార్ట్మెంట్ అడ్వయిజర్ విఎన్.భరత్‌రెడ్డి విచ్చేశారు. ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎంఎల్‌ఎ చిర్ల.జగ్గిరెడ్డి, సౌమ్య హాస్పిటల్, పాలకొల్లు ప్రముఖ వైద్యులు రాజశేఖర్, ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి, సర్పంచి సూర్యనారాయణ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

'తమ్మినేని వ్యాఖ్యలు సరికావు'

ప్రజాశక్తి - ఆకివీడు

రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం టిడిపి అధినేత చంద్రబాబుపై చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని కాళింగగూడెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు తప్పుబట్టారు. వెంటనే ఆయన మాటలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కళింగ నాయకుడు రాజగోపాల్‌రావు విగ్రహం వద్ద బుధవారం సాయంత్రం టిడిపి నాయకుడు పూజారి ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వెంటనే సీతారాం వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గౌరవప్రదమైన స్పీకర్ స్థానంలో ఉండి ఒక ప్రతిపక్ష నాయకుడిపై ఈ రకమైన వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. తమ్మినేని సీతారాంపై పోలీసులు సుమోటో కేసు నమోదు చేయాలన్నారు. అనంతరం వారు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.



పంట బోదె తవ్వకం పనులు పరిశీలిస్తున్న ఎపిఒ శ్రీనివాస్

చురుగ్గా ఉపాధి పనులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జగన్నాథపురం, కోమటితిప్ప, వారతిప్ప, కొత్తోట, కాశీపట్నం తూర్పు, కెపిపాలెం నార్త్, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లోని పంట బోదె తవ్వకం పనులు చేపట్టారు. బుధవారం జగన్నాథపురంలో చేపట్టిన తవ్వకం పనులను మస్తరు ఎపిఒ వై.శ్రీనివాస్ పరిశీలించారు.



కార్మికులకు సబ్బులు, నూనె అందజేస్తున్న దాసిరాజు

కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మున్సిపాల్టీలో పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక అధికారి దాశి రాజు బుధవారం సబ్బులు, కొబ్బరి నూనె పంపిణీ చేశారు. పాలకొల్లు పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యతిచ్చి సిబ్బంది మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషాద్రి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పి.శ్రీనివాస్‌రాజు, చందక కుమార్ రాజా, మున్సిపల్ ఇంజినీర్ సాంబశివుడు పాల్గొన్నారు.

పిల్లలను బడి మాన్పించొద్దు

ప్రజాశక్తి - పోడూరు

తల్లిదండ్రులు తమ పిల్లలను మధ్యలో బడి మాన్పించకుండా ఉన్నత చదువులు పూర్తి చేసే వరకూ చదివించాలని తహశీల్దార్ కృష్ణారావు పిలుపునిచ్చారు. గుమ్ములూరు పంచాయతీ పరిధిలోని పైడవ గ్రామంలో బుధవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పౌర హక్కుల గురించి వివరించారు. స్థానిక ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్య, వైద్యం తదితర సదుపాయాల గురించి వివరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ చట్టంపై, మహిళలకున్న చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గొట్టుముక్కల సోనియా రమేష్, ఎంపిటిసి అంబటి సుధాకర్, పోడూరు ఎస్ఐ డి.రామకుమార్, ఆర్ఐ కె.రాంబాబు, సచివాలయ కార్యదర్శి పిల్లి కృష్ణవర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ కృష్ణారావు

వృద్ధులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గ్రామంలో ఏర్పాటు చేస్తున్న వైఎస్ఆర్ కంటి వెలుగు ద్వారా కంటి సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు అన్నారు. కంటి వెలుగు ముగింపు సందర్భంగా బుధవారం కాశిపాడులో జరుగుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన వృద్ధులు కంటి పరీక్షలు చేయించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారందరికీ ప్రభుత్వం ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి జంపన పద్మావతి రమేష్‌రాజు, సర్పంచి కోటనాగేశ్వరరావు, ఆరోగ్య సహాయకులు నామాల రాజు, ఎఎన్‌ఎం.శివకుమారి పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు



మాట్లాడుతున్న శేఖర్‌బాబు

గ్రంథాలయంలో తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ఎక్కువగా పుస్తక పఠనం చేయాలని, గ్రంథాలయంలో సభ్యులుగా చేరాలని తెలిపారు. అనంతరం పిల్లలు వారు నేర్చుకున్న విషయాలను చాలా చక్కగా ప్రదర్శించారు. ఉన్నత పదవులు పొందిన నిష్ణాతులైన ఉద్యోగులు, అధ్యాపకులు, ప్రముఖ వ్యక్తులు అన్ని అంశాలకూ రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరిస్తూ వారి జ్ఞానాన్ని పంచుతూ అభినందిస్తున్నారని తెలిపారు. అనంతరం కార్యదర్శి విజేతలకు బహుమతులు అందజేశారు. విరామ సమయంలో స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూర్యంబాబు, సమర్పణరావు, సుధీర్ మోహన, డాక్టర్ వివిఎస్.నాయుడు, అభిరామ్ పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రసాదరాజు

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మండలంలోని ఎల్‌బిచర్లలో పార్వతీ సోమేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు. 200 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్వతీ సోమేశ్వరస్వామి ఆలయం స్థానంలో నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే విధంగా పసలదీవి గ్రామంలో వరసిద్ధి వినాయక ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేములదీవి వెస్ట్‌లో వైభవ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్, మండల అధ్యక్షులు దొంగ మురళీకృష్ణ, తిరుమాని నాగరాజు, గుబ్బల భాను, అయ్యగారి కృష్ణమోహన్, కంచర్ల రామకృష్ణ, వడ్డీ కాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి జూనియర్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం జూనియర్ కళాశాలలో జూన్ 1 నుంచి ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు 23-24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నట్లు కాలేజీ ప్రిన్సిపల్ రఘు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ఎంపిసి, సిఇసి, బైపిసి, హెచ్‌ఇసి, ఎంపిహెచ్ గ్రూపులకు తెలుగు, ఇంగ్లీష్ మీడియం అడ్మిషన్ జరుగుతున్నట్లు చెప్పారు తన కాలేజీలో అనుభవం కలిగిన అధ్యాపకులతో విద్యార్థులకు విద్యాబోధన చేయడం జరుగుతుంది అని చెప్పారు దీంతోపాటు ప్రభుత్వం నుంచే సంక్షేమ పథకాలని విద్యార్థులకు అందుతాయని చెప్పారు పదవ తరగతి ఉత్తీర్ణత అయిన విద్యార్థులందరూ కాలేజీ ప్రవేశం కొరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు